సాక్షి
రంగారెడ్డి
శనివారం, 15, జూలై, 2023



విధ్వంస ఆలోచన

బీఆర్‌ఎస్‌ది వెలుగుల పాలన అయితే.. కాంగ్రెస్‌ది విధ్వంస ఆలోచన అని ఎమ్మెల్యే కాలె యాదయ్య ధ్వజమెత్తారు. 8లో▸



అడ్మిషన్లకు అర్హత పోటీలు

క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం అర్హత పోటీలు నిర్వహిస్తున్నామని యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. 8లో▸



అవగాహన తప్పనిసరి

రెవెన్యూ చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాగాంధీ రైతులకు సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్లుగా ప్రతిమ సింగ్, భూపాల్‌రెడ్డి

అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సహా ఆర్డీఓల బదిలీ



ప్రతిమ సింగ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో అధికారుల బదిలీల ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తిరుపతిరావును వికారాబాద్ డీఆర్‌ఓగా బదిలీ చేయగా, తాజాగా మరో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతీక్‌జైన్‌ను భద్రాచలం సమీకృత గిరిజన సంక్షేమాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పని చేస్తున్న ప్రతిమ సింగ్‌ను నియమించింది. అలాగే అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) ఎంపీ భూపాల్‌రెడ్డిని నియమించింది. ఈయన భువనగిరి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా పని చేసి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ ఈ.వెంకటాచారిని కూడా బదిలీ చేశారు. ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్ అనంతరెడ్డిని నియమించారు. రాజేంద్రనగర్ ఆర్డీఓగా ఈ.మల్లయ్యను నియమించగా.. ఇక్కడ పనిచేస్తున్న చంద్రకళను జీఏడీకి బదిలీ చేశారు. శేరిలింగంపల్లి డివిజనల్ కమిషనర్, తహసీల్దార్‌గా టి.శ్రీనివాసరావును నియమించారు. ఒకటి రెండు రోజుల్లో మరికొంత మంది అధికారులు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

రౌడీషీటర్‌పై కత్తులతో దాడి

పహాడీషరీఫ్: రౌడీషీటర్‌పై కత్తులతో దాడికి పాల్పడిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం .. బండ్లగూడ గౌస్‌నగర్‌కు చెందిన చాంద్, సుల్తాన్, హఫీజ్ స్నేహితులు మూడు రోజుల క్రితం సిగరేట్ తాగుతున్న క్రమంలో గొడవ జరిగింది. దీంతో చాంద్ బండ్లగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. 15 మంది స్నేహితులు జోక్యం చేసుకొని రాజీ కుదిర్చేందుకు శుక్రవారం రాత్రి వాదే ముస్తఫాలో సమావేశమయ్యారు. ఈ సమయంలో మాటమాటా పెరిగి చాంద్ స్నేహితుడైన వాదే ముస్తఫాలో నివాసం ఉండే గోల్కొండ రౌడీషీటర్ అబ్దుల్లా బిన్‌అలీ (32) కడుపు, వీపు భాగాలలో సుల్తాన్, హఫీజ్ కత్తులతో పొడిచారు. బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. హత్యాయత్నం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను వేధిస్తున్న ఇద్దరి అరెస్టు

నందిగామ: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ రౌడీషీటర్‌తో పాటు మరో వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని మోదల్లగూడకు చెందిన పుణ్యవతిని ఇదే గ్రామానికి చెందిన రౌడీషీటర్ యాదగిరిరెడ్డితో పాటు లక్ష్మయ్య గౌడ్ కొంతకాలంగా మానసికంగా, శారీరకంగా వేధిచడంతోపాటు అసభ్యంగా ప్ర వర్తిస్తున్నారు.ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్ రూరల్: ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శనివారం 'డయల్ యువర్ డీఎం' నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఉష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 9959226287 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలన్నారు.

అభినందన



విఘ్నేశ్‌గౌడ్‌ను అభినందిస్తున్న మంత్రి

ఆమనగల్లు: ఇండియన్ నేషనల్ మోటార్ సైకిల్ రేసింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన బైక్ రైడర్, మాడ్గుల మండలం ఇర్విన్‌కు చెందిన టీఆర్‌ఎస్ నాయకుడు పాలకుర్ల యాదయ్యగౌడ్ కుమారుడు విఘ్నేశ్‌గౌడ్‌ను ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. చెన్నైలో ఇటీవల మూడు రోజుల పాటు నిర్వహించిన ఇండియన్ నేషనల్ మోటార్ సైకిల్ రేసింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో 165 సీసీ విభాగంలో పాల్గొన్న విఘ్నేశ్ చాంపియన్‌గా నిలిచారు. ఈ మేరకు నగరంలోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు. ప్రభుత్వం తరపున విఘ్నేశ్‌కు అవసరమైన చేయూతనిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం నగేశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఆమెకు ఆరోగ్య భాగ్యం



సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య కేంద్రం

జిల్లాలో ఆరోగ్య మహిళా క్లినిక్స్
- ప్రతి మంగళవారం వైద్య పరీక్షలు
- 17 పీహెచ్‌సీల్లో ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు
- 8 రకాల వ్యాధులకు ఉచిత స్క్రీనింగ్, చికిత్సలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణ డయాగ్నోస్టిక్స్, పల్లె, పట్టణ దవాఖానాలు, కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు వంటి సేవలతో ఇప్పటికే అన్ని వర్గాల ప్రజలకు చేరువైన వైద్యారోగ్య శాఖ.. మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం మరో సర్వీసును అందుబాటులోకి తెచ్చింది. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ మహిళకు ఎనిమిది రకాల రుగ్మతలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించనుంది. దీంతో వ్యాధి ముదరక ముందే చికిత్సలు చేయించుకునే అవకాశం కలుగుతుంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలవుతోంది. మన జిల్లాలోనూ 17 ఆరోగ్య కేంద్రాల్లో మహిళల కోసం ప్రత్యేకంగా 'ఆరోగ్య మహిళా క్లినిక్స్'ను ప్రారంభించారు. ప్రతీ మంగళవారం ఆయా కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేయనున్నారు. స్క్రీనింగ్ తర్వాత మందులు, ఉచిత చికిత్సలు చేయనున్నారు.

మహిళా వైద్య సిబ్బందితోనే

జిల్లా వ్యాప్తంగా 18 ఏళ్లు నిండిన మహిళలు 14,91,245 మంది ఉన్నట్లు అంచనా. మహిళల్లో సాధారణంగా రక్త హీనత, అయోడిన్ లోపం, అధిక బరువు, మధుమేహం, అధిక రక్తపోటు, విటమిన్ లోపం, మూత్ర సంబంధిత ఇన్ఫెక్షన్లు, నెలసరి సమస్యలు, సంతాన లేమి, మోనోపాయిజ్, గర్భాశయ ముఖ ద్వార, రొమ్ము, ఓరల్ కేన్సర్, థైరాయిడ్, హెచ్ఐవీ, ఫోలిక్ యాసిడ్, వంటి దీర్ఘకాలిక రుగ్మతల బారిన పడుతుంటారు. ఆయా వ్యాధి లక్షణాలు పెద్దగా బయటకు కనిపించవు. ఈ నేపథ్యంలో హెల్త్‌పై అవగాహన లేక, చికిత్సకు డబ్బులు దొరకక అనేక మంది తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తుంటారు. సిగ్గు, బిడియానికి తోడు ఆర్థికపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని మెజార్టీ మహిళలు తమ సమస్యను బయటికి చెప్పుకొనేందుకు నిరాకరిస్తుంటారు. దీనికి తోడు ఇంట్లో ఉన్న భర్త, పిల్లలు కూడా వారి ఆరోగ్యం గురించి పెద్దగా పట్టించుకోరు. తీరా వ్యాధి ముదిరి, బయటపడే సమయానికి.. కోలుకోలేని నష్టం సంభవిస్తుంది. ఫలితంగా మొత్తం కుటుంబమే సంక్షోభంలో పడుతుంది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల ఈ మహిళా క్లినిక్స్‌ను అందుబాటులోకి తెచ్చింది.

స్క్రీనింగ్ స్పాట్లు

జిల్లాలో గైనకాలజిస్టులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో బాలాపూర్, సరూర్‌నగర్, దండుమైలారం, అబ్దుల్లాపూర్‌మెట్, కందుకూరు, తలకొండపల్లి, గట్టు ఇప్పలపల్లి, కేశంపేట్, చించోడు, కొందుర్గు, నందిగామ, మైలార్‌దేవులపల్లి, శేరిలింగంపల్లి, చందనవెళ్లి, మొయినాబాద్, శంకర్‌పల్లి పీహెచ్‌సీల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని మహిళలు ఈ సర్వీసులను ఉపయోగించుకోవచ్చు. స్క్రీనింగ్ క్యాంపుల్లో కేవలం మహిళా సిబ్బంది మాత్రమే సేవలు అందిస్తారు. వీరు వ్యాధులను నిర్ధారించడమే కాకుండా భవిష్యత్తులో మహిళలు దీర్ఘకాలిక రుగ్మతల బారినపడకుండా సూచనలు, సలహాలు అందజేస్తారు. దీంతో ఎనభైశాతం మంది జీవనశైలి వ్యాధులకు ఇక్కడే పరిష్కారం లభిస్తుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆరోగ్యం మెరుగుకు చర్యలు



జిల్లాలోని 80 బస్తీ దవాఖానాల్లో 12 వైద్య పోస్టులు, 158 పల్లె దవాఖానాల్లో 22 డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ జారీచేశాం. నవజాత శిశువుల సంరక్షణ కోసం కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో 20 పడకల సామర్థ్యంతో ఎస్‌ఎన్‌సీయూ ఏర్పాటు చేశాం. మధుమేహం, అధిక రక్తపోటు, కేన్సర్ వంటి జబ్బులతో బాధపడుతున్న 50,547 మందిని గుర్తించి ప్రతినెలా మందులు అందజేస్తున్నాం.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌ఓ



చిలుకూరులో డిజిటల్ క్లాస్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ సుశీందర్‌రావు

ఉత్తీర్ణత శాతం పెంచాలి

- జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు
- చిలుకూరు ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతుల పరిశీలన

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషిచేయాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఉపాధ్యాయులను ఆదేశించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిజిటల్ క్లాస్‌ను పరిశీలించి, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం తగిన ప్ర ణాళిక రూపొందించుకోవాలనిదిశానిర్దేశం చేశారు. విద్యాబోధన విధానంలో చాలా మార్పులు వచ్చాయని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తూ వారి ప్రతిభను పెంచాలని తెలిపారు. తర్వాత చిలుకూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు మండల విద్యాధికారి వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ రెహమాన్, భీమయ్య తదితరులు ఉన్నారు.

ధర్మ్యాతండా సర్పంచ్ మృతి



ఉమ్లీ(ఫైల్)

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం ధర్మ్యాతండా సర్పంచ్ వడ్త్య ఉమ్లీ (70) శుక్రవారం మృతిచెందారు. గురువారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించింది. శుక్రవారం ఉదయం విరేచనాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఆమె కాలికి ఉన్న గాయాన్ని గమనించిన స్థానికులు పాము కాటేసి ఉండవచ్చని చర్చించుకుంటున్నారు. సర్పంచ్ మృతితో తండాలో విషాదం అలుముకుంది.

అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిశీలన



అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న రాచకొండ సీపీ చౌహాన్

అబ్దుల్లాపూర్‌మెట్: రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ శుక్రవారం ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పీఎస్‌లో నమోదైన నేరాల వివరాలతో పాటు సిబ్బంది పనితీరు, స్టేషన్ నిర్వహణపై సీఐ మన్మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని ప్రతీ విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి.. ఎస్ఐలు కరుణాకర్‌రెడ్డి, కిషన్, వెంకట్రామ్‌రెడ్డి, సునీల్‌కుమార్‌లతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

జైలుకెళ్లినా బుద్ధి మారలే..

- బాలికను వేధిస్తున్న యువకుడి రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికను వేధింపులకు గురిచేసిన ఓ యువకుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం..హస్తినాపురంలో ఉంటున్న పల్లపు సాయి (21) అనే యువకుడు నాలుగు నెలల క్రితం బైరమల్‌గూడలో నివాసమున్న సమయంలో.. ఇంటి పక్కనే ఉండే బాలికను వేధింపులకు గురిచేశాడు. ఈ మేరకు అతనిపై ఎల్‌బీనగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. దీంతో సాయిని అరెస్టు చేసి, చంచల్‌గూడ జైలు పంపించారు. ఆతర్వాత బాలిక తల్లిదండ్రులు ఇల్లు మారారు. మూడు నెలల క్రితం జైలు నుంచి విడుదలైన సాయి.. బాలిక తుర్కయంజాల్‌లో ఉంటోందని తెలుసుకుని గురువారం అక్కడకు వెళ్లాడు. పాఠశాలకు వెళ్తున్న సదరు బాలిక చెల్లె, తమ్ముడిని అడ్డగించి మీ అక్కకు నా ఫోన్ నంబర్ ఇవ్వాలంటూ వేధింపులకు గురిచేశాడు. దీంతో బాధితులు మరోసారి ఆదిబట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి సాయిని నిందితుడిని తరలించారు.

ఉనికి కోసమే ప్రతిపక్షాల పాట్లు



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి తదితరులు

- మంత్రి సబితారెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

మీర్‌పేట: ప్రతిపక్ష పార్టీలు తమ ఉనికిని కాపాడుకునేందుకే ఇంటి పన్నుల పేరిట ధర్నాలు చేస్తున్నాయని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి 32వ డివిజన్ అయోధ్యనగర్, హుడాకాలనీ, ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ ఫేజ్– 2, ఓల్డ్ బాలాజీనగర్ కాలనీల్లో రూ.1.24 కోట్లతో చేపట్టనున్న సీసీరోడ్లు, మినీవాటర్ ట్యాంక్, ఓపెన్‌జిమ్, పార్కు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. సీసీ కెమెరాల ప్రారంభోత్సవంతో పాటు రూ.65 లక్షల వ్యయంతో రెడ్డి బ్యాటరీ నుంచి ఎస్ఆర్‌డీజీ స్కూల్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన, రూ.78 లక్షలతో జిల్లెలగూడ అంబేడ్కర్ విగ్రహం నుంచి అల్మాస్‌గూడ కమాన్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో పన్నుల భారాన్ని తగ్గించాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా గతంలో మాదిరిగానే పన్నులు వసూలు చేయాలని ఆదేశించినట్లు వివరించారు. ఈ విషయంలో ఎవరైనా అధికారులు ఎక్కువగా వసూలు చేసి ఉంటే వచ్చే సంవత్సరంలో తగ్గించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారన్నారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, డీఈ గోపినాథ్, ఏఈ శ్రీనివాసులు, కార్పొరేటర్లు వేముల నర్సింహ, ధరంకార్ జ్యోతికిషోర్, మీర్‌పేట బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కామేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంటకు ఎసరు!



రియల్టర్ల కన్ను
- కనుమరుగవుతున్న సుద్దమోనికుంట
- రాత్రివేళల్లో జోరుగా పూడ్చివేత పనులు
- పాలకుల అండదండలే కారణం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో రియల్టర్ల ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోతోంది. రియల్టర్ల కన్నుపడిందంటే చాలు చెరువులు, కుంటలన్నీ మాయమవుతున్నాయి. తాజాగా మరో తటాకంపై కన్నేశారు. నిత్యం నీటితో కళకళలాడుతూ.. పరిసర ప్రాంతాలకు భూగర్భజలాలను అందిస్తూ.. తాగు, సాగు నీటి అవసరాలను తీరుస్తున్న ఆ కుంట క్రమంగా ఆనవాళ్లను కోల్పోతోంది. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల కళ్లుగప్పి.. రాత్రికి రాత్రే లారీల్లో మట్టి, పెద్దపెద్ద రాళ్లు తరలించి కుంటలో నింపుతున్నారు. రోజురోజుకు కుంట ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు రియల్టర్లకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

లారీల్లో మట్టి డంపింగ్

బాలాపూర్ మండలం మల్లాపూర్ రెవెన్యూ వెంకటాపూర్‌లో సుమారు పదిహేను ఎకరాల విస్తీర్ణంలో సుద్దమోనికుంట ఉంది. ఆర్సీఐ, బాలాజీనగర్, ద్వారాకా బాలాజీ కాలనీల నుంచి వరద నీరు వచ్చి ఈ కుంటలో నిల్వ ఉంటుంది. కాలంతో సంబంధం లేకుండా నిత్యం నీటితో కళకళలాడుతుంది. ఎఫ్‌టీఎల్ పరిధిలోని శిఖం పట్టా భూములు సైతం నీట మునిగాయి. ప్రస్తుతం ఆయా భూముల్లో మూడు నుంచి ఐదు అడుగుల నీరు నిల్వ ఉంది. ఆర్సీఐ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే మార్గంలో ఉన్న ఈ ఖరీదైన భూములపై కొంత మంది రియల్టర్ల కన్ను పడింది. ఎలాగైనా వీటిని చేజిక్కించుకోవాలని భావించి ఆ మేరకు రాత్రికి రాత్రే లారీల్లో పెద్ద ఎత్తున మట్టి, రాళ్లు తరలించి కుంటలో నింపుతున్నారు. వర్షాలకు ఎగువ నుంచి వరదనీరు వచ్చి కుంటలో చేరకుండా అడ్డుకట్టలు వేస్తుండటంతో ఆయా నీరంతా లోతట్టు కాలనీలను ముంచెత్తుతోంది. కుంట పూడ్చివేత అంశంపై ఇటీవల కొంత మంది స్థానికులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కుంటలో మట్టి, రాళ్లు నింపుతున్న లారీలతో పాటు చదును చేస్తున్న జేసీబీని సీజ్ చేశారు. అధికారుల చర్యతో తాత్కాలికంగా కొద్ది రోజులు పనులు నిలిపివేశారు. నాలుగు రోజుల నుంచి మళ్లీ పనులు ప్రారంభించారు. పగటి వేళలో పనులు నిర్వహిస్తే ..ఆయా శాఖల అధికారులు వచ్చి మళ్లీ అడ్డుకునే ప్రమాదం ఉందని భావించి.. రాత్రి పొద్దుపోయిన తర్వాత గుట్టుచప్పుడు కాకుండా పూడ్చివేతకు పూనుకుంటున్నారు.

పునరుద్ధరణకు రూ.కోటి మంజూరైనా..

చెరువులు, కుంటల పునరుద్ధరణ పథకంలో భాగంగా ప్రభుత్వం ఇటీవల హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఈ సుద్దమోనికుంటకు రూ.కోటి నిధులు మంజూరు చేసింది. కుంట చుట్టూ కట్టను ఏర్పాటు చేసి, ఆక్రమణలకు గురికాకుండా కాపాడటంతో పాటు దాని చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అంతేకాదు కట్టచుట్టూ మొక్కలను నాటి అహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఆ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని యోచించింది. అయితే అప్పటికే ఈ కుంట శిఖం భూములపై కన్నేసిన కొంత మంది ప్రభుత్వ ప్రతిపాదనకు అడ్డుతగిలారు. దీంతో కుంట పునరుద్ధరణ పనులు ప్రారంభానికి నోచుకోలేకపోయాయి.

చర్యలు తీసుకుంటాం

కుంట శిఖం పూడ్చివేత అంశం మా దృష్టికి వచ్చింది. మట్టిని తరలిస్తున్న లారీలను ఇప్పటికే సీజ్ చేశాం. అధికారుల కళ్లుగప్పి రాత్రివేళ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిని నింపుతున్న వాళ్లపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. పోలీసులకు ఫిర్యాదు చేసి, రాత్రివేళ గస్తీ నిర్వహిస్తాం. కుంట ఆనవాళ్లు దెబ్బతినకుండా కాపాడుతాం.

– జనార్దన్, తహసీల్దార్, బాలాపూర్

చివరికి మిగిలింది విషాదమే



మృతులు పద్మ, ధనలక్ష్మి.



అభినవ్, శరణ్య



మృతదేహాల వద్ద బంధువుల రోదనలు

- చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి
- దోమలగూడ వంట గ్యాస్ లీకేజీ ప్రమాద ఘటన

గాంధీ ఆస్పత్రి: దోమలగూడ వంట గ్యాస్ లీకేజీ ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. కాలిన గాయాలతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అయిదుగురిలో ముగ్గురు శుక్రవారం మృతి చెందారు. ధనలక్ష్మి, పద్మ, అభినవ్‌లు శుక్రవారం మరణించగా, బుధవారం శరణ్య మృతి చెందింది. దోమలగూడ రోజ్‌గార్ కాలనీకి చెందిన పద్మ అనే మహిళ బోనాల వేడుకలకు పద్మారావునగర్ బాపూజీనగర్‌లో నివసిస్తున్న కుమార్తె ధనలక్ష్మి, ఎల్‌బీనగర్‌లో ఉంటున్న సొంత చెల్లెలు నాగమణి కుటుంబాలను ఆహ్వానించింది. ధనలక్ష్మితోపాటు భర్త లాలాజీ శ్యామ్, కుమార్తె శరణ్య, కుమారులు అభినవ్, విహాన్‌లు, చెల్లెలు నాగమణి, భర్త ఆనంద్‌లు ఈ నెల 10న రోజ్‌గార్ కాలనీలోని పద్మ ఇంటికి చేరుకున్నారు. మంగళవారం పిండివంటలు చేసేందుకు స్టవ్‌ను వెలిగించగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఒకే గదిలో ఉన్న ఏడుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. అదే సమయంలో అల్లుడు శ్యామ్ బయటకు వెళ్లడంతో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. మంటలను అదుపుచేసి గాయపడిన ఏడుగురిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న క్షతగాత్రులను పీఐసీయు, టీఎంటీ, బర్న్స్‌వార్డుల్లో వెంటిలేటర్‌పై వైద్యసేవలు అందించారు. చికిత్స పొందుతూ బుధవారం శరణ్య (7), శుక్రవారం పద్మ (53) ధనలక్ష్మి (29) అభినవ్ (8) మృతి చెందారు.

నేను ఎవరి కోసం బతకాలి..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో పద్మారావునగర్ బాపూజీనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల బంధువులు, కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి. అత్త, భార్య, ఇద్దరు పిల్లలు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారని, మరో చిన్నారి చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నాడని తాను ఇంకా ఎవరికోసం బతకాలని శ్యామ్ కన్నీటి పర్యంతమయ్యాడు. పోస్టుమార్టం అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాలను బాపూజీనగర్‌కు తరలించి ముషీరాబాద్ మొరంబండ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. గాయపడిన మరో చిన్నారి విహాన్ (3) ఆల్వాల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు ఆనంద్, నాగమణిల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

కాంగ్రెస్‌ది విధ్వంస ఆలోచన

- అధికారం కోసం కారుకూతలు
- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: బీఆర్‌ఎస్‌ది వెలుగుల పాలన అయితే.. కాంగ్రెస్‌ది విధ్వంస ఆలోచన అని ఎమ్మెల్యే కాలె యాదయ్య హస్తం పార్టీపై ధ్వజమెత్తారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా.. శుక్రవారం మండల కేంద్రంలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్ మాట్లాడిన తీరు రైతులకు అన్యాయం చేసే విధంగా ఉందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తుంటే.. పరాయి పాలకులు, కిరాయి నేతల కళ్లు మండి ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ వెలుగులను ఆర్పాలని, రైతులను చీకట్లో పాము కాటుకు, కరెంటు షాక్‌కు బలిచేయాలని, అధికారం హస్తగతం చేసుకోవటానికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలు బయట పడ్డాయని దుయ్యబట్టారు.

ఉచిత విద్యుత్ ఊసేలేదు

రైతు డిక్లరేషన్ పేరిట వరంగల్ సభలో రాహుల్ గాంధీ విడుదల చేసిన ప్రకటనలో ఉచిత విద్యుత్ ఊసేలేదని, అనుకోకుండా అమెరికాలో కాంగ్రెస్ రైతు వ్యతిరేక కుట్రలు రేవంత్‌రెడ్డి రూపంలో బయటపడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతీ తదితరులు పాల్గొన్నారు.


రేవంత్ దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

అన్ని రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

శంకర్‌పల్లి/చేవెళ్ల: రాష్ట్రం అన్ని రంగాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండలంలోని మీర్జాగూడ, అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డి నగర్ గ్రామాల్లో రూ.1 కోటి 50లక్షల హెచ్ఎండీఏ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలా గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన దాఖలాలు లేవన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత గ్రామాలకు మహర్దశ వచ్చిందని చెప్పారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు తీసుకువస్తున్నానని చెప్పారు. శంకర్‌పల్లి మండలం అభివృద్ధిలో ఎంతో ముందజంలో ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపరావు, వైస్ చైర్మన్ వెంకటేశ్, సర్పంచ్‌లు రవీందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ శాంతి కిషన్‌సింగ్, నియోజకవర్గం యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాంతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

నిండు గర్భిణి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రమాదవశాత్తు నిండు గర్భిణి కిందపడి మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల పరిధిలోని కుర్మల్‌గూడ రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉండే మౌనిక(23),వినయ్‌కుమార్‌తో గత మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. ప్రస్తుతం మౌనిక ఎనిమిది నెలల గర్భవతి. భర్త వినయ్‌కుమార్ పనికి వెళ్లాడు. ఇంట్లో పనులు చేసుకుంటుండగా మౌనిక బోర్ల కింద పడింది. ఇంటి తలుపు తెరిచి ఉండడంతో పక్కింటి వారు చూసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మౌనిక మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ముగ్గురు నిందితులకు రిమాండ్

తలకొండపల్లి: ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించిన ఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ శివారు ప్రాంతంలో విద్యుత్ మోటర్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు చోరీకి గురైన కేసులో శ్రీధర్, హర్షవర్ధన్, షువాకుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్ యాదవ్ తెలిపారు.

శంకర్‌పల్లి మున్సిపాలిటీకి రూ.25కోట్లు

శంకర్‌పల్లి/చేవెళ్ల: శంకర్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25కోట్లు నిధులు మంజూరు చేయడంపై మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలో మున్సిపల్, ఐటీ శాఖమంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శంకర్‌పల్లి మున్సిపాలిటీకి నిధులు విడుదలపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన శంకర్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని పలుమార్లు కోరడంతో స్పందించిన కేటీఆర్ రూ.25కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. అడిగిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేసిన కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం మరువలేనిదని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


నిధుల మంజూరు ఉత్తర్వులను అందజేస్తున్న మంత్రి కేటీఆర్

విద్యార్థి అదృశ్యం

మీర్‌పేట: కళాశాలకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన ఘటన శుక్రవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐగోవిందుస్వామి కథనం ప్రకారం .. బడంగ్‌పేట లక్ష్మీనారాయణకాలనీకి చెందిన రవి కుమారుడు శివ (17) బీఎన్‌రెడ్డినగర్ చైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులుగా శివ కళాశాలకు సరిగ్గా వెళ్లకపోవడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన శివ 13న ఉదయం తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే ఉంచి కళాశాలకు వెళ్లి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ప్రయో జనం లేక పోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శివ (ఫైల్)

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం.. వ్యక్తి దుర్మరణం

మహేశ్వరం: ఎదురుగా వస్తున్న బైక్‌ను డీసీఎం వాహనం ఢీకొట్టడంతో బైకిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలం పరిధిలోని నాగారం–రామారావు చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. సీఐ మురి తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రగూడకు చెందిన మెఘావత్ దశరథనాయక్ (50) శుక్రవారం ఉదయం బైక్‌పై శంషాబాద్ కూరగాయాల మార్కెట్‌కు కూరగాయలు తీసుకురావడానికి వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో శంషాబాద్ నుంచి రామచంద్రగూడకు వస్తున్న క్రమంలో నాగారం వద్దకు రాగానే మన్సాన్‌పల్లి చౌరస్తా నుంచి నాగారం వైపు అతి వేగంగా వస్తున్న డీసీఎం వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దశరథ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. డీసీఎం డ్రైవర్ మహ్మద్ యూసఫ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.


మృతి చెందిన దశరథనాయక్

నకిలీ పురుగుల మందుల తయారీ కేంద్రంపై దాడి

- రూ. 5లక్షల విలువ గల ఉత్పత్తుల స్వాధీనం
- పోలీసుల అదుపులో నిర్వాహకుడు


నకిలీ మందుల డబ్బాలతో నిర్వాహకుడు

అబ్దుల్లాపూర్‌మెట్: ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మొక్కలకు వాడే పురుగులు నివారణ మందులను తయారీ చేస్తున్న కేంద్రంపై ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇనాంగూడ అనుబంధ గ్రామం కుంట్లూర్‌కు చెందిన ఉప్పాటి ఏడుకొండలురెడ్డి గత కొంతకాలంగా ఒక షెడ్డులో పూలు, పండ్లు, కూరగాయల మొక్కలకు వాడే పురుగుల నివారణ నకిలీ మందులను తయారు చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం నకిలీ మందుల తయారీ కేంద్రంపై వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. రూ. 5లక్షల విలువైన నకిలీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాగాంధీ

యాచారం: రెవెన్యూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాగాంధీ రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో శుక్రవారం 'వ్యవసాయరంగం–న్యాయ సలహాలు' అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ చట్టాలపై అవగాహన లేక రైతులు మోసపోతున్నారన్నారు. కోర్టుకు వచ్చే కేసుల్లో అధికంగా భూములకు సంబంధించినవేనని తెలిపారు. రైతులు గట్లు, గుంటల విషయాల్లో ఘర్షణలకు దిగుతూ కేసులపాలవుతున్నారని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్ల సామగ్రి కొనుగోలు సమయంలో రైతులు కచ్చితంగా రశీదులు పొందాలని సూచించారు. రైతులు మోసపోయిన సమయాల్లో వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీపీ కొప్పు సుకన్య, జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏడీఏ సత్యనారాయణ, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇందిరాగాంధీ

స్విమ్మర్ క్వీని విక్టోరియాకు సత్కారం


క్వీని విక్టోరియాను సత్కరిస్తున్న ఆచారి

ఆమనగల్లు: అంతర్జాతీయ అండర్ వాటర్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించిన స్విమ్మర్, ఆమనగల్లు పట్టణానికి చెందిన గంధం క్వీని విక్టోరియాను బీజేపీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం గంధం క్వీని విక్టోరియాను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి ఘనంగా సత్కరించారు. భారతదేశం తరఫున మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, నాయకులు లక్ష్మణ్, విజయ్‌కృష్ణ, నర్సింహ, లక్ష్మణ్‌రావ్, నర్సింహారెడ్డి, ప్రభాకర్, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్లకు అర్హత పోటీలు


రన్నింగ్ పోటీల్లో విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం అర్హత పోటీలు నిర్వహిస్తున్నావని రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలల్లో 4, 5వ తరగతిలో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద శుక్రవారం ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ కేటగిరీల్లో టెస్టులు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 100 మంది బాలబాలికలు పాల్గొన్నారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్‌స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్, షటిల్‌రన్, మెడిసిన్ బాల్‌త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన బాల బాలికలను మాత్రమే రాష్ట్రస్థాయిలో జరుగు ఎంపికలకు పంపిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం శిక్షకులు, పీఈటీలు పాల్గొన్నారు.